# కోడీలా





**వీకెండ్ అయితే చాలు చికెన్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడేవి. అలాంటి షాపులు ఆదివారం వెలవెలబోయాయి. రాష్ట్రంలోని జిల్లాల్లో బాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకడంతో ఆ ప్రభావం ఇక్కడ పడింది. దీంతో మాంసాహార ప్రియులు ఆదివారం చికెన్ జోలికి వెళ్లలేదు. చేపలు, మటన్ వైపు మళ్లారు. దీంతో చికెన్ దుకాణాలు బోసిపోగా చేపలు, మటన్ దుకాణాలు కిటకిటలాడాయి.**


శ్రీహరిపురంలో ఖాళీగా ఉన్న చికెన్ షాపు

మల్కాపురం: బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ వ్యాపారులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక్కసారిగా వ్యాపారాలు పడిపోవడంతో తమ పరిస్థితి ఏంటి అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అమ్మకాలు సాగక, పని చేస్తున్న వర్క్‌ర్స్‌కు జీతాలు ఇచ్చుకోలేని పరిస్థితి ఎదురవుతోంది. మరో వైపు జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవని.. ముందు జాగ్రత్తలు తీసుకున్నామని అధికారులు ప్రకటించినా చికెన్ ప్రియులు భయపడుతున్నారు. కొంతమంది నాన్‌వెజ్‌ను వాయిదా వేసుకోగా మరి కొంత మంది చేపలు కొనుగోలు చేశారు.

**ఇదీ పరిస్థితి**

పారిశ్రామిక ప్రాంతంలోని జీవీఎంసీ 40,58,59,60,61,62,63 వార్డుల్లో సుమారు 130 చికెన్ షాపులు ఉన్నాయి. వీటిలో ఒక్క ఆదివారం నాడే సుమారు 40 వేల కిలోలు లైవ్ ( కోళ్లు) అమ్మకాలు సాగేవి. వార్డుల పరిధిలో షాపుల్లో వ్యాపారులు కాకుండా వర్కర్స్ సుమారు 300 మంది పని చేస్తున్నారు. ఒక్క ఆదివారం అన్ని షాపుల ద్వారా రూ. 50 లక్షల వ్యాపారం జరిగేది. అయితే రెండు వారాల నుంచి బర్డ్‌ఫ్లూ వైరస్ కారణంగా చికెన్ షాపుల వద్దకు జనం పెద్దగా రావడం మానేసారు. దీంతో కొంత మంది వ్యాపారులు అప్పులు చేసి చికెన్ సెంటర్‌కు తెచ్చుకున్న కోళ్ల అమ్మకాలు సాగక వాటి వంక చూస్తూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.


కోరమాండల్ వద్ద వ్యాపారం లేక దిక్కులు చూస్తున్న నిర్వాహకులు

### అమ్మకాలు పడిపోయాయి



మా చికెన్ షాపులో ఒక్కసారిగా వ్యాపారం పడిపోయింది. ఆదివారం రూ. లక్షకు పైగా వ్యాపారం చేసే వారిమి. నేడు రూ. 20 వేలు కూడా అమ్మకాలు సాగించలేదు.ఇదే పరిస్థితి కొనసాగితే మాకు ఇబ్బందులే. జనం అపోహలు వీడాలి.ఈ వైరస్ మన ప్రాంతాలకు రాలేదు. కోడిని వందశాతం ఉడికిస్తే వైరస్ మరణిస్తుంది.

–చింతలపాటి శ్రీనివాసరాజు, చికెన్ వ్యాపారికోరమాండల్

### అప్పు చేసి కోళ్లు తెచ్చాం



షాపులో వ్యాపారం కోసం అప్పు చేసి కోళ్లు తెప్పించాం. అయితే రెండు వారాల నుంచి అమ్మకాలు అంతగా లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. మా వద్ద పని చేస్తున్న వర్కర్స్‌కు జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకుంటుంది.ఈ పరిస్థితి ఎన్నాళ్లు ఉంటుందో ఏమిటో!.

–చెరకాపు శ్రీనివాసరావు, చికెన్ వ్యాపారి, శ్రీహరిపురం


చేపల మార్కెట్లో జనం కోలహలం

### పెరిగిన చేపలు,మటన్ అమ్మకాలు

ఇది ఇలా ఉంటే బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ అమ్మకాలు పడిపోతే మేక,గొర్రె మాంసం అమ్మకాలతో పాటు చేపల వ్యాపారం భారీగా పెరిగింది. సాధారణ రోజుల్లో ఆదివారంపూట మాంసం అమ్మకాలు రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఉంటే బర్డ్‌ఫ్లూ కారణంగా వాటి అమ్మకాలు రెట్టింపు అయ్యాయి. అలాగే చేపల మార్కెట్‌కు జనం పోటెత్తారు. ఇక్కడ వ్యాపారులు ఒక్కసారిగా చేపల రేట్లు పెంచారు. అయినా కొనుగోలు చేశారు.

### భయం లేదని చెప్పినా..

బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవని.. భయపడవద్దని అధికారులు చెబుతున్నా ప్రజలు వణికిపోతున్నారు. సాహసం చేయడం ఎందుకు.. కోడిమాంసం తినకపోవడమే మంచిదని భావిస్తున్నారు. బర్డ్‌ఫ్లూ వైరస్ పక్షికి సోకితే ఇతర పక్షులకు సులువుగా సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇది గాలి ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పక్షిని మనిషి తాకిన లేదా ఆ పక్షి వాసన పీల్చినా, మల విసర్జనను చేతులతో తొలగించినా వ్యాధి సులువుగా మనిషికి వచ్చే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ వ్యాధి లక్షణాలు కరోనా వైరస్ మాదిరిగా జలుబు,గొంతు నొప్పి వంటి లక్షణాలు ఉంటాయని చెబుతున్నారు. వ్యాధి సోకిన కోళ్లను వంద శాతం ఉడికిస్తే ఆ వైరస్ చనిపోతుందని,తద్వార మనిషికి ఎలాంటి హాని ఉండదని వ్యాపారులు చెబుతున్నారు.

## క్లుప్తంగా

### ఘనంగా జువ్వాలమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయ కమిటీ సభ్యులతో బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు జువ్వాలమ్మ ఆలయ 27వ వార్షి కోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు బెహరా భాస్కర రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారి శేష వస్త్రాలు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆ యనతో పాటు వార్డు అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన పరస ఉత్సాహంగా సాగింది.

### మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్క నాటుతున్న కార్పొరేటర్ వెంకటరమేష్, జేడీ ఫౌండేషన్ సభ్యులు

గోపాలపట్నం: మొక్కలను విరివిగా పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చునని 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం జేడీ ఫౌండేషన్ సభ్యులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ వెంకట రమేష్ మొక్క నాటి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జేడీ ఫౌండేషన్ సభ్యులు చేపడుతున్న పనులు నగర ప్రజలకు ప్రశాంతతను ఇస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి


దేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక: శ్రీకృష్ణ దేవరాయలు జయంతిని స్థానిక శ్రీకృష్ణదేవరాయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గు జంక్షన్‌లోని దేవరాయల విగ్రహానికి సంఘం నాయకులు నివాళులర్పించారు. అనంతరం సంఘం ఉపాధ్యక్షుడు కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ దేవరాయలు విజయనగర సామ్రాజ్యంలో ప్రజలకు సువర్ణ పాలన అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో కాపులందరూ ఐక్యంగా ఉండాలని, శ్రీకృష్ణ దేవరాయల వారసులుగా అదే ఆయనకిచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుడివాడ అమ్మన్న, గుడివాడ అప్పలరామ్మూర్తి, విందుల వెంకట రమణ, కాతా బాలకృష్ణ, ఇందల ఈశ్వరరావు, శంకర రావు, ఈశ్వరరావు, మహలక్ష్మినాయుడు, బాలు నాయుడు, రౌతు గోవింద్, సంద్రాన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక హారతి ఇస్తున్న పూజారి విజయమ్మ

కంచరపాలెం: కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

## పండగలు సంప్రదాయాలకు ప్రతీకలు

**డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్**


పూజ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

విశాఖవిద్య: సమైక్యతను చాటేలా సంప్రదాయ పండగలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని తలుపులమ్మతల్లి రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై పూజలను ప్రారంభించారు.పండగలు సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. రజకులు తమ దైవంగా భావించే బల్లలకు ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో మహిళలు, రజక సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## జూ నుంచి కంబాలకొండకు రహదారి


కంబాలకొండ పార్కు, నర్సరీ మధ్యలో నిర్మించిన మట్టి రోడ్డు

ఆరిలోవ: జాతీయ రహదారిపై కంబాలకొండ ఎకో టూరిజం పార్కు లోపల కొద్ది రోజులుగా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఇక్కడ 200 మీటర్ల పొడవున మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. కంబాలకొండ లోపల ప్రధాన ద్వారం సమీపం నుంచి జూ పార్కు ఎదురుగా ఉన్న అటవీ శాఖ నర్సరీకి మట్టి రోడ్డు నిర్మించారు. దీని మధ్యలో ఉన్న గెడ్డ అడుగు భాగంలో నీటి కుండీలు అమర్చి వాటిపై రాళ్లు పేర్చి మట్టితోనే కల్వర్టు కట్టారు. దీనివల్ల జూ పార్కు నుంచి సందర్శకులు నేరుగా కంబాలకొండ పార్కుకు రాకపోకలు సులువవుతుంది. ప్రస్తుతం సందర్శకులు జూ పార్కు నుంచి కంబాలకొండ వెళ్లడానికి జాతీయ రహదారిపై విశాఖ వ్యాలీ స్కూల్ కూడలి వరకు సుమారు అర కిలోమీటర్‌కు పైగా వెళ్లి అక్కడ యూ టర్న్ తీసుకొని తిరిగి రావాల్సి వస్తుంది. ఇప్పుడు ఇక్కడ కల్వర్టు, మట్టి రోడ్డు నిర్మించడంతో ఆ సమస్య తీరనుంది. జూ పార్కు గేటు నుంచి ఎదురుగా ఉన్న నర్సరీ గేటు లోకి ప్రవేశించి కంబాలకొండ పార్కుకు సులువుగా చేరుకోవచ్చని కంబాలకొండ అధికారులు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి కృషి

**ఉక్కు ఎల్‌డీసీ విభాగాధిపతి ఠాగూర్**


ఎల్‌డీసీ నూతన విభాగాధిపతి ఠాగూర్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని స్టీల్ ప్లాంట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎల్‌డీసీ) నూతన విభాగాధిపతి టి.కె.ఎస్.ఆర్ ఠాగూర్ అన్నారు. ఎల్‌డీసీ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఠాగూర్‌ను కలిసి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్‌డీ ద్వారా అనేక స్కిల్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం ద్వారా పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చి వారి నైపుణ్యాన్ని పెంపొందించడానికి శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. తౌడన్న, బయ్యే మల్లయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కోసం హెచ్‌ఆర్‌డీ ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సత్యనారాయణ, కోశాధికారి కె.వి. రత్నం, పుల్లారావు, మోహన్‌బాబు, సాయిప్రసాద్, టర్కీ, గణేష్, రామన్న, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

సీతంపేట : గ్రంథాలయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అరసం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక రాష్ట్ర కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పుస్తక పఠనంతో విద్యార్థులు, పాఠకులు మంచి పౌరులుగా తయారయ్యేలా గ్రంథాలయాలు దోహదపడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల గ్రంథాలయాల నిర్వహణ, ఉనికి సమస్యల్లో పడిందన్నారు. వందేళ్ల కిందట నడిచిన ఉద్యమం వల్ల ఎన్నో గ్రంథాలయాలు ఏర్పడి ప్రజలకు జ్ఞాన సంపద అందించాయని గుర్తు చేశారు. అటువంటి గ్రంథాలయాలపట్ల అశ్రద్ధ వహించడం అన్యాయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఇప్పటికీ రాష్ట్ర గ్రంథాలయం ఏర్పాటు కాలేదన్నారు. రాష్ట్రంలో కేవలం మూడు ప్రాంతీయ గ్రంథాలయాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం అప్పట్లో శాసన మండలి ఫ్లోర్ లీడర్‌గా మూడుసార్లు ప్రశ్నించినట్టు తెలిపారు. దొంగ చేతికి తాళాలు అప్పగించినట్టు ఎవరైతే 100 కోట్ల గ్రంథాలయ స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నించారో ఆయనే విద్యాశాఖా మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. దీనిపై శాసన మండలిలో ప్రశ్న లేవనెత్తగా మూడు నెలల్లో గ్రంథాలయం నిర్మిస్తామని సభకు హామీ ఇచ్చారని, తొమ్మిదేళ్లు గడిచినా అతీగతీ లేదన్నారు. పౌరుల చొరవతో విశాఖ పౌరగ్రంథాలయం అద్భుతంగా నిర్వహిస్తున్నారని, అటువంటిది ప్రభుత్వం తలచుకుంటే ఇంకెంత బాగా నిర్వహించవచ్చో ఆలోచించాలన్నారు. అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ రానున్న ఏప్రిల్‌లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి సమావేశంలో గ్రంథాలయాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక విశాఖ జిల్లా కన్వీనర్‌గా బసు పోతన, కో కన్వీనర్‌గా ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## యాదవ ఉద్యోగుల సంక్షేమానికి కృషి


శేషు రామకృష్ణయాదవ్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మల్కాపురం: యాదవ ఉద్యోగుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని బీఎంఎస్ జాయింట్ సెక్రటరీ చెల్లిబోయిన శేషు రామకృష్ణయాదవ్ అన్నారు. ఈస్టన్ నేవల్ కమాండ్ యాదవ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్‌లో పదవులు వచ్చిన చెల్లిబోయిన శేషు రామకృష్ణ యాదవ్,యూనియన్ ఉపాధ్యక్షుడు లొడగల శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు పదవీ విరమణ పొందుతున్న సత్కరించారు.ఈ సందర్భంగా ఉద్యోగుల కుటుంబ సభ్యులకు,వారి పిల్లలకు ఆటలు, పాట పోటీలు నిర్వహించారు.వీటిలో ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు ఇచ్చి అభినందించారు.కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## బాల్యం నుంచి భద్రతపై అవగాహన అవశ్యం


ప్రసంగిస్తున్న వర్క్స్ సీజీఎం మొహంతి

ఉక్కునగరం: చిన్న వయసు నుంచే విద్యార్థులకు భద్రతపై అవగాహన కల్పించడం అవశ్యమని.. తద్వారా బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దగలమని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతి అన్నారు. జాతీయ భద్రతా దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం ఉక్కు మల్టీపర్పస్ హాలు లో విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్, నాటిక పోటీ లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో భద్రత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పోటీల్లో ఉక్కునగరం, పెదగంట్యాడ ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం ప్రవీణ్‌కుమార్, జీఎంలు యు.ఎన్. బెహరా, భద్రతా విభాగాధిపతి ఎం.ఎస్.ఎన్. రాజు, డీజీఎం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

గాజువాక: విశాఖపట్నం జిల్లా (రూరల్) ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా బెల్లాల పెంటబాబు, కార్యదర్శిగా గునిశెట్టి అప్పల సత్యనారాయణ, కోశాధికారిగా కట్టా సత్యానందం, యువజన సంఘం అధ్యక్షుడిగా కందుల సాయి సత్యనారాయణ, కార్యదర్శిగా రెంటాల సుధాకర్, కోశాధికారిగా కోట్ల గుప్తతోపాటు మహిళా సంఘం, సేవాదళ్ తదితర కమిటీల సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, కర్నూల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి, అభివృద్ధికి కమిటీ కృషి చేయాలన్నారు. రాజకీయంగా ఎదిగేందుకు ఆర్యవైశ్యులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కారుమూరు మహేష్, పి.పి.ఎస్.నాగేశ్వరరావు, గుంపిన రఘునాథగుప్త తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధమవుతున్న హెలికాప్టర్ మ్యూజియం


హెలికాప్టర్ మ్యూజియం ప్రవేశ ద్వారం


సుందరీకరణలో భాగంగా నాటిన మెక్కలు

ఏయూక్యాంపస్: పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని అందించేందుకు బీచ్ రోడ్డులో యూహెచ్3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం సిద్ధమవుతోంది. తుది మెరుగులు దిద్దుకుంటూ కొద్ది రోజుల్లో ప్రారంభానికి ముస్తాబవుతోంది. ప్రస్తుతం ఈ ప్రాంగణం చుట్టూ పచ్చదనం, మొక్కలు పెంచే పనులు జరుగుతున్నాయి. లాన్‌లో వేయడానికి ప్రత్యేక గ్రీన్ లాన్ తీసుకువచ్చారు. యుద్ధ విమానం మ్యూజియం బయట లాన్‌లో అవసరమైన ప్రాంతంలో వీటిని పరచే పనులు నిర్వహిస్తున్నారు. అదే ప్రాంగణంలో పచ్చదనం పెంచే చర్యల్లో నిర్లక్ష్యం తాండవిస్తోంది. కొన్ని మొక్కల వేళ్లు బయటకు కనిపిస్తున్నాయి. మొక్కలు నాటడంతో లోపాలను సరిచేయాల్సిన అవసరం ఉంది.


వేళ్లు బయటకు వచ్చిన మొక్క

## ఆధ్యాత్మిక చింతనతో జీవించాలి


పూజల్లో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, తదితరులు

తాటిచెట్లపాలెం : తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల శ్రీ లక్ష్మి వినాయక ఆలయంలో శ్రీ గురుపాద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సంకటహర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు బాలానంద శివాచార్య స్వామి శైవ ఆగమ సంప్రదాయంలో మంగళధ్వని వేదమంత్రాలతో హోమం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజలో ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని ఆయన సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు సీపీని ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, శ్రీ గురుపాద సేవా సమితి సభ్యులు ఎంవీ రమణమూర్తి, పి.వేణుగోపాల్, డీఎస్ వర్మ, రమణమూర్తి, మహిళా సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు


రౌడీషీటర్లుకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్తుటౌన్ ఇన్‌చార్జి సీఐ దాలిబాబు

సీతమ్మధార : రౌడీయిజం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఫోర్తుటౌన్ ఇన్‌చార్జి సీఐ దాలిబాబు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై ప్రత్యే నిఘా పెట్టామన్నారు. గొడవలకు పాల్పడినా, ఎవరినైనా బెదిరించినా చర్యలు తప్పని హెచ్చరించారు. అల్లర్లు చేయకుండా... తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. ఎస్‌ఐ జి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.